సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం ၊ 14 ၊ జూన్ ၊ 2023



తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలు
రాజవొమ్మంగి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అమీనాబాద్‌కాలనీకి చెందిన తండ్రి కుమారుడుకు తీవ్ర గాయాలయ్యాయి.
8లో



అర్హులందరికీ సంక్షేమం 9లో
ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ తప్పనిసరిగా అందించాలని వెలుగు ఏపీడీ శ్రీనివాస్ సూచించారు.



'సంపద కేంద్రం' పరిశీలన
రంపచోడవరం మండలంలో తామరపల్లిలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని డీఎల్పీవో రాఘవన్ పరిశీలించారు. 9లో

న్యూస్‌రీల్

నాణ్యమైన దిగుబడుల సాధనే లక్ష్యం



పత్తి విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రామలక్ష్మి, డైరెక్టర్ శ్యామ్‌కుమార్

గంగవరం : గిరిజనులతో నాణ్యమైన పంట దిగుబడులు సాధించడమే లక్ష్యమని హైపర్ ఇంటర్నేషనల్ గ్రామీణ వికాస కేంద్రం ప్రోగ్రాం డైరెక్టర్ కె.శ్యామ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎండపల్లి గ్రామంలో ఆధ్వర్యంలో గిరిజన రైతులకు సదస్సు నిర్వహించారు. వివిధ వ్యవసాయ పద్ధతులపై ఆయన అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయం వైపు గిరిజన రైతులను ప్రోత్సహించేందుకు సంస్థ పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఆయన పేర్కొన్నారు. గిరిజన రైతులకు పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండపల్లి సర్పంచ్ రామలక్ష్మి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ విజయరెడ్డి, సచివాలయ వీఏఏ యాట్ల ఉషారాణి, సంస్థ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా సుబ్రమణ్యం



రాజవొమ్మంగి: స్థానిక ఏపీ గిరిజనసంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా వి. సుబ్రమణ్యం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాయచోటి (అన్నమయ్య జిల్లా) బాలికల గురుకుల పాఠశాల నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ సత్యవేణి మారేడుమిల్లి బాలుర గురుకుల పాఠశాలకు బదిలీ అయ్యారు.

రేపటి నుంచి పోలవరం గ్రామసభలు

చింతూరు: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గ్రామాలకు సంబంధించి ప్రాధాన్యత క్రమంలో గుర్తించిన ఐదు గ్రామాల్లో ఈనెల 15 నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కారం సుబ్బారావు మంగళవారం తెలిపారు. 15న మల్లెతోట, 16న ఉలుమూరు, 17న ఏజీ కొడేరు, 19న చూటూరు గ్రామాల్లో రచ్చబండల వద్ద ఉదయం 10.30 నుంచి గ్రామసభలు జరుగుతాయని ఆయన తెలిపారు. మార్కండేయుల పేటలో 19వ తేదీ మధ్యాహ్నం 2.30 నుంచి చింతూరు గ్రామ సచివాలయం వద్ద గ్రామసభ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సభల్లో సామాజిక, ఆర్థిక సర్వేలో నమోదు చేసిన కుటుంబాల వివరాలపై చర్చ ఉంటుందన్నారు. సంబంధిత గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభల నిర్వహణ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఏకలవ్యలో ప్రవేశాలకు 16న కౌన్సెలింగ్

పాడేరు రూరల్ : పాడేరు ఐటీడీఏ పరిధిలోని డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, జీకే వీధి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాలల్లో 2023–24 సీబీఎస్ఈ ప్లస్ వన్ ప్రవేశాలకు ఈనెల 16న స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో టెన్త్ పాసై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు జీకే వీధి ఏకలవ్య ప్రిన్సిపాల్‌ను 9908595435 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 80 శాతంపైగా ఉత్తీర్ణత

ఆరిలోవ : ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు అదరగొట్టారు. 80 శాతం పైగా ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షలు గత నెల 24న ప్రారంభమై జూన్ 1 వరకు జరిగిన విషయం తెలిసిందే. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రథమ సంవత్సరం 49,105 మంది, ద్వితీయ సంవత్సరం 41,510 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలు ముగిసిన సుమారు 10 రోజులకే పేపరు మూల్యాంకనం పూర్తయింది. అనంతరం వీటి ఫలితాలను రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి మంగళవారం విడుదల చేసింది. ఈ పరీక్షల ఫలితాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 80.26 శాతం (39,414 మంది) ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 80.67 శాతం(33,487 మంది) ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఉమ్మడి విశాఖ జిల్లా రాష్ట్రంలో ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఐదో స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో తొమ్మిదో స్థానంలో నిలిచింది.

సదా మీసేవలో..

జిల్లా కేంద్రం పాడేరులో కలెక్టర్ చైర్మన్‌గా ఏర్పాటైన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెరుగైన సేవలు అందిస్తోంది. పాడేరు ఐటీడీఏ సహకారంతో రక్తదాన శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తూ గిరిజనులకు ఆపద్బాంధవిగా నిలుస్తోంది. అతి తక్కువ వ్యవధిలో 35 శిబిరాలు నిర్వహించి, 826 యూనిట్ల రక్తాన్ని సేకరించింది.

- స్ఫూర్తిదాయకంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు
- గ్రామాల్లో విస్తృతంగా రక్తదాన శిబిరాలు
- సికిల్‌సెల్ ఎనీమియా, గర్భిణులకు వరం
- గిరిజనుల పాలిట ఆపద్బాంధవి
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



కలెక్టరేట్‌లో రక్తదానం చేస్తున్న సీఐ సుధాకర్, సీఆర్‌పీఎఫ్ జవాన్లతో కలెక్టర్ సుమిత్‌కుమార్ (ఫైల్)



పాడేరులోని బ్లడ్ బ్యాంకులో నిల్వలు

సాక్షి, పాడేరు: రక్తదానం మహాదానంగా ప్రపంచం గుర్తించింది. మానవ శరీరంలో మాత్రమే తయారయ్యే రక్తాన్ని అత్యవసర పరిస్థితుల్లో తోటి మనిషికి రక్తదానం చేస్తూ ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. ప్రపంచమంతా రక్తదాతల త్యాగానికి గుర్తుగా ఈనెల 14వ తేదీన ప్రపంచ రక్తదాతల దినోత్సవంగా జరుపుకుంటోంది. ఎంతోమంది ప్రాణాలను వైద్యబృందాలు కాపాడే ప్రక్రియలో రక్తదాతలు కీలకపాత్ర పోషిస్తున్నారు.

గతంలో ఎన్నో ఇబ్బందులు..
రక్తం సేకరణ, నిల్వ, సకాలంలో రోగులకు అందించేందుకు మైదాన ప్రాంతాల్లో అనేక బ్లడ్ బ్యాంకులు పనిచేస్తున్నాయి. పూర్వం నుంచి గిరిజన ప్రాంతాల్లో రక్తం అవసరాలకు కేజీహెచ్, ఇతర బ్లడ్ బ్యాంకులపైనే ఆధారపడాల్సి వచ్చేది. అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎక్కించేందుకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడేవి.

వైఎస్ హయాంలో..
మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయిన తరువాత పాడేరు జిల్లా ఆస్పత్రిలో రక్తనిల్వ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆ తరువాత అరకులోయ, రంపచోడవరం ప్రాంతాలకు రక్తం నిల్వ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. మైదాన ప్రాంతాల్లోని బ్లడ్ బ్యాంకుల ద్వారా సేకరించిన రక్తాన్ని ఏజెన్సీకి తరలించి గర్భిణులు, ఎనీమియా కేసులకు అందించేవారు.అయితే పూర్తిస్థాయిలో రక్తం లేక రోగులకు చాలా ఇబ్బందులు ఉండేవి.

పాడేరు ఐటీడీఏ సహకారంతో..
గత ఏడాది ఫిబ్రవరి 22వతేదీన ప్రభుత్వం, పాడేరు ఐటీడీఏ సహకారంతో పాడేరులో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రారంభమైంది. గిరిజన ప్రాంతాల్లో రక్తం ఆవశ్యకతను సొసైటీ గుర్తించింది. ఈ సంస్థకు పాడేరు ఐటీడీఏ భవన సదుపాయం సమకూర్చింది. ఆ తరువాత ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు జిల్లాకు పాడేరు కేంద్రంగా ఏర్పాటు చేయడంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి మరింత ప్రాధాన్యం పెరిగింది.

పెరిగిన రక్తదాన శిబిరాల నిర్వహణ
పాడేరులో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి కలెక్టర్ సుమిత్‌కుమార్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన దృష్టి పెట్టడంతో జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాల నిర్వహణ సంఖ్య కూడా పెరిగింది. జిల్లాలోని 35 రక్తదాన శిబిరాలు నిర్వహించి, ఇప్పటికి 826 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

బ్లడ్ క్యూరింగ్ సెంటర్
సేకరించిన రక్తాన్ని విశాఖలోని పలు బ్యాంకుల్లో క్యూరింగ్ చేసేందుకు ప్రతీ యూనిట్‌కు సుమారు రూ.2 వేల వరకు ఖర్చు అయ్యేది. దీంతో పాడేరు జిల్లా ఆస్పత్రిలోనే బ్లడ్‌క్యూరింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. సేకరించిన రక్తాన్ని ఇక్కడే క్యూరింగ్ చేసి బ్లడ్ బ్యాంకులో భద్రపరుస్తున్నారు. ఇక్కడ నుంచి పాడేరు జిల్లా ఆస్పత్రిలో రోగులతో పాటు రంపచోడవరం, అరకులోయ, చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రులు, చింతూరు, ముంచంగిపుట్టు సీహెచ్‌సీలకు రక్తం యూనిట్లను పంపుతున్నారు.

పోలీసులు, ఉద్యోగులే అధికం
పాడేరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా రక్తదాన శిబిరాలు జిల్లాలో జరుగుతున్నాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు వైద్యబృందాలన్నీ రక్తదాన శిబిరాలు విజయవంతానికి శ్రమిస్తున్నాయి. ఇంతవరకు సీఆర్‌పీఎఫ్ జవాన్లు, పలు విభాగాల పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులే అధికంగా రక్తదానం చేశారు.కొన్ని వర్గాల యువకులు కూడా రక్తదానం చేసేందుకు ముందుకు వస్తున్నారు.

26సార్లు రక్తదానం
పాడేరు సీఐ సుధాకర్ ఇప్పటికి 26సార్లు రక్తం దానం చేశారు.చదువుకున్న వయసు నుంచే సేవాగుణం అలవర్చుకున్న ఆయన రక్తం దానం చేసేందుకు ముందుండేవారు. తోటి పోలీసులు, జవాన్లను కూడా రక్తదానంకు ప్రోత్సహిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందనలు పొందారు.

సంతోష్ 14 సార్లు..
తెలంగాణకు చెందిన సంతోష్ పాడేరులో డిజిటల్ ప్రింటింగ్ దుకాణం నిర్వహిస్తూ గత పదేళ్లుగా స్థిరపడ్డారు.ఆయన ఇప్పటికి 14సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు.

నిరంతరం మెరుగ్గా..

పాడేరు జిల్లా ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకు నిరంతరం మెరుగైన సేవలు అందిస్తోంది. సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడే చిన్నారులకు పాడేరులోని వైద్యసేవలను ప్రభుత్వం ఆరు నెలల నుంచి అందుబాటులోకి తెచ్చింది. దీంతో ఆవ్యాధితో బాధపడే వారికి రక్తం అధికంగా అవసరం ఉంటుంది. అలాగే రక్తహీనత సమస్యతో బాధపడే గర్భిణులకు ప్రసవ సమయంలోను రక్తం అందిస్తున్నారు. రక్తం కొరత లేకుండా చూసేందుకు రెడ్‌క్రాస్ సొసైటీతో పాటు శిబిరాల విజయవంతానికి అధికారులు శ్రమిస్తున్నారు.

యువత ముందుకు రావాలి



రక్త దానంతో తోటి మనిషి ప్రాణాలను ఆపద నుంచి కాపాడవచ్చు. డిగ్రీ చదివే యువతీ యువకులు కూడా రక్త దానం చేసేందుకు ముందుకు రావాలి. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని బలోపేతం చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో రక్తం అవసరాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు రక్తదానం చేసి మానవత్వం చాటుకోవాలి.

– సుమిత్ కుమార్, కలెక్టర్/చైర్మన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ

మన్యం వాసులకు శుభవార్త

- జిల్లాలో అందుబాటులోకి రానున్న 88 సెల్ టవర్లు
- వర్చువల్ విధానంలో రేపు ప్రారంభించనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- సుబ్బులు, భీమవరం గిరిజనులతో సమీక్షించనున్న ముఖ్యమంత్రి



సుబ్బులు గ్రామంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నసెల్ టవర్

సాక్షి,పాడేరు: జిల్లాతోపాటు పార్వతీపురం మన్యం జిల్లాలోని 100 జియో సెల్‌టవర్లను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 15వతేదీ గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. జిల్లాకు సంబంధించి 88 సెల్ టవర్ల నిర్మాణం పూర్తయ్యింది. వీటిని సీఎం చేతుల మీదుగా ప్రారంభం కానుండడంతో మారుమూల గిరిజనుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లాలోని మారుమూల గ్రామాలకు కూడా కమ్యూనికేషన్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు.

● జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలో జియో, బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌లకు సంబంధించి 2,323 సెల్ టవర్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర రెవెన్యూ యంత్రాంగమంతా సెల్ టవర్ల నిర్మాణాలకు అవసరమైన స్థలాలను కేటాయించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జియో నెట్‌వర్క్‌కు సంబంధించి జిల్లాలో 88 సెల్‌టవర్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిని సీఎం జగన్మోహన్‌రెడ్డితో వర్చువల్ విధానంలో ప్రారంభించేందుకు ప్రభుత్వ యంత్రాంగం తగిన ఏర్పాట్లలో నిమగ్నమైంది.

గిరిజనులతో సీఎం సమీక్ష
జిల్లాలో 88 జియో సెల్‌టవర్లను వర్చువల్ విధానంలో ప్రారంభించడంతో పాటు రెండు గ్రామాల గిరిజనులతో మాట్లాడతారని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. పాడేరు నియోజకవర్గంలోని జి.మాడుగుల మండలం మారుమూల సుబ్బులు, అరకు నియోజకవర్గ పరిధిలోని హుకుంపేట మండలం మారుమూల భీమవరం గ్రామాల గిరిజనులతో సీఎం వీడియో సమావేశం ద్వారా మాట్లాడుతారని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం భీమవరం గ్రామాన్ని,సోమవారం సుబ్బులు గ్రామాన్ని సందర్శించారు. సెల్ టవర్లను పరిశీలించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో సెల్‌టవరర్ల ప్రారంభం, గిరిజనులతో వీడియో సమావేశంపై ఆయన సమగ్రంగా వివరించారు.

క్షయ వ్యాధిపై అవగాహన కల్పించండి

రాష్ట్ర అడిషినల్ డైరెక్టర్ యాస్మిన్



రోగులతో మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ యాస్మిన్

హుకుంపేట: గిరిజన ప్రాంతంలో క్షయ వ్యాధి నివారణకు సంబంధించి అవగాహన కల్పించాలని రాష్ట్ర క్షయ నివారణ విభాగం అడిషినల్ డైరెక్టర్ యాస్మిన్ పేర్కొన్నారు. మంగళవారం ఆమె స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. క్షయ వ్యాధి కేసులు, గర్భిణుల వివరాలు, జననీ సురక్ష యోజన పథకం వివరాలను ఆమె తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగులతో మాట్లాడారు. అందుతున్న సేవల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్యంలో ప్రతీ గ్రామంలో ఈ నెల 26వ తేదీ నుంచి వైద్య సిబ్బంది క్షయ వ్యాధి కేసులను గుర్తించాలని సూచించారు. అంతేకాకుండా వ్యాధి, నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.జమాల్‌బాషా, క్షయ నివారణ విభాగం జిల్లా ఇన్‌చార్జి డా.విశ్వేశ్వరనాయుడు, స్థానిక వైద్యాధికారి సుమన పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంతోనే ఏజెన్సీ అభివృద్ధి

- అధిక ప్రాధాన్యమిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు
- రూ.2.30 కోట్లతో పెదకొండ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



పెదకొండ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

రంపచోడవరం: రోడ్ల నిర్మాణంతో ఏజెన్సీ అభివృద్ధి సాధ్యమని, ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అనేక గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించిందని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (అనంతబాబు)అన్నారు. మండలంలోని రంప సచివాలయం పరిధిలో మర్రివాడ– పెదకొండకు రోడ్డు నిర్మాణానికి మంగళవారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ ఏజెన్సీలో సెల్ నెట్ వర్క్‌ను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో సమాచారం అందించే వీలు కలిగిందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ ప్రభుత్వం మారుమూల గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు అనేక రోడ్డు నిర్మాణాలు చేపట్టిందన్నారు. పెదకొండకు ఏళ్ల తరబడి సరైన రోడ్డు సదుపాయం లేదన్నారు. రూ. 2.30 కోట్లతో రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేసి గిరిజనులకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. ఏజెన్సీలో రవాణా వ్యవస్థ మెరుగు పరచడం ద్వారానే పూర్తిస్థాయిలో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అటవీ అభ్యంతరాలతో కొన్ని రోడ్డులు నిలిచిపోయాయని వాటికి అనుమతులు రప్పించడమే కాకుండా వాటిని పూర్తి చేసే బాధ్యత తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, సొసైటీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర, సర్పంచ్‌లు కారం కుమారి, చెదల దేవి, మంగా బొజ్జయ్య, కోసు రమేష్‌బాబు, వడగల ప్రసాద్, స్వామిదొర, మిర్తివాడ ఆనంద్‌రెడ్డి, బోడి వెంకటలక్ష్మి, కుంజం వెంకటలక్ష్మి, ఎంపీటీసీ కుంజం వంశీ, సాయిబాబు, షేక్‌వలీ, ఉలవల లక్ష్మి పాల్గొన్నారు.

3,520 మందికి స్థానచలనం

- బదిలీలతో ఉపాధ్యాయుల్లో జోష్
- వెబ్ కౌన్సెలింగ్‌పై సర్వత్రా హర్షం
- ఇంట్లో కూర్చొని బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు
- ఎటువంటి పైరవీలు లేకుండానే కోరుకున్న చోటుకు బదిలీ
- ఉమ్మడి విశాఖ జిల్లాలో పూర్తయిన బదిలీలు

విశాఖ విద్య: ఉపాధ్యాయుల బదిలీలు అంటే అదో ప్రహసనంగా ఉండేది. ఆందోళనలు, ధర్నాలతో విద్యాశాఖాధికారుల తలలకు బొప్పి కట్టేది. ఇది ఒకప్పటి మాట.. నేడా పరిస్థితి లేదు. ఎటువంటి పైరవీలు లేకుండానే ఎంచక్కా ఇంట్లో కూర్చొని కోరుకున్న చోటుకు బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయుల్లో సరి కొత్త జోష్ కనిపిస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో బదిలీల ప్రక్రియ పూర్తయింది. బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు పాత ప్రదేశాల నుంచి రిలీవై కొత్త ప్రదేశాల్లో చేరారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని క్యాడర్లు కలుపుకొని 3,520 మంది ఉపాధ్యాయులకు బదిలీ జరిగినట్లు డీఈఓ కార్యాలయ అధికారులు వెల్లడించారు. ఇందులో గ్రేడ్ –2హెచ్ఎం –150, స్కూల్ అసిస్టెంట్ గణితం– 336, స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్ – 170, స్కూల్ అసిస్టెంట్ బయాలజీ– 203, స్కూల్ అసిస్టెంట్ సోషల్ –255, స్కూల్ అసిస్టెంట్ తెలుగు– 172, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ –380, హిందీ –93, ఫిజికల్ డైరెక్టర్– 73 మంది ఉపాధ్యా యులకు బదిలీ జరిగింది. అదేవిధంగా సెకండరీ గ్రేడ్ టీచర్లు 1,688 మందికి బదిలీ అయింది. వెబ్ కౌన్సె లింగ్ పద్ధతిన బదిలీల ప్రక్రియ జరగడంతో ఉపాధ్యాయులు తమ ఇంట్లో కూర్చుని బదిలీ ఉత్తర్వులు అందుకున్నారు. ఎటువంటి పైరవీలు లేకుండా కోరుకున్న చోటకు బదిలీ జరుగడంతో ఉపాధ్యాయుల్లో సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది. 8 ఏళ్ల సర్వీసు పైబడిన ఉపాధ్యాయులు ఎక్కువగా ఉండటంతో బదిలీ ఉత్తర్వుల జారీలో జిల్లాలో కాస్త ఆలస్యమైంది. బదిలీ కోరుకునే ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్ల సమయంలో చేసిన తప్పిదాల కారణంగా, అదేవిధంగా డీఈఓ కార్యాలయం సిబ్బంది సకాలంలో ఖాళీలను చూపించకపోవడం వంటి కారణాలతో జిల్లాలో ఎస్జీటీ క్యాడర్లకు సంబంధించిన ఉత్తర్వులు జారీ కావడంలో ఆలస్యమైంది. ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖ డీఈవో చంద్రకళ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేయడం ద్వారా బదిలీల ప్రక్రియ సజావుగా ముగిసింది. వెబ్ ఆప్షన్‌లో చోటు చేసుకున్న తప్పిదాల కారణంగా బదిలీ ఉత్తర్వులు అందుకోలేని ఉపాధ్యాయులకు సైతం మేలు చేసేలా విద్యాశాఖ ఉన్నతాధికా రులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలాంటి వారు డీఈఓ కార్యాలయంలో సంప్రదిస్తే అందుబాటులో ఉన్న ఖాళీలు మేరకు వారికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చేలా పరిశీలిస్తున్నారు.

భార్యను కాపురానికి పంపలేదని మామపై కత్తితో దాడి



పోలీసులు అరెస్ట్ చేసిన చిట్టిబాబు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భాస్కరరావు

కొయ్యూరు: భార్యను కాపురానికి పంపించలేదన్న కోపంతో మామను కత్తితో నరికి చంపేందుకు అల్లుడు ప్రయత్నించాడు. గాయాలైన మామను ఆస్పత్రికి తరలించారు. కొయ్యూరు ఎస్ఐ రాజారావు మంగళవారం తెలిపిన వివరాలివి. రాజేంద్రపాలెం పంచాయతీ సోలాబుకు చెందిన పాంగి భాస్కరరావు తన కూతురు లక్ష్మిని గూడెం మండలంలో చినగొంది గ్రామానికి చెందిన వంతల చిట్టిబాబుకు ఇచ్చి 18 సంవత్సరాల కిందట వివాహం చేశారు. అల్లుడు, కూతురు మూడేళ్ల కిందట కాకరపాడు వచ్చి ఉంటున్నారు. అల్లుడు కూతురిని సరిగా చూడకపోవడంతో భాస్కరరావు లక్ష్మిని తన ఇంటికి తీసుకువెళ్లి పోయాడు. దీంతో మామపై కక్ష పెంచుకున్న చిట్టిబాబు కాకరపాడు మెకానిక్ షెడ్ వద్ద అదును చూసి భాస్కరరావుపై కత్తితో దాడి చేశాడు. దీంతో భాస్కరరావు తలపై, ఎడమచేతికి గాయాలయ్యాయి. దీనిని ఆపేందుకు ప్రయత్నించిన మరశ్రీనుపై కూడా దాడి చేయడంతో అతను కూడా గాయపడ్డాడు. ఈ ఘటనపై ఫిర్యాదు రావడంతో ఎస్ఐ రాజారావు నిందితుడు చిట్టిబాబును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. గాయపడిన భాస్కరరావును ఆస్పత్రికి తరలించారు.

నేడు డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

సాక్షి,పాడేరు: ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని పాడేరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మెగా రక్తదానశిబిరం నిర్వహిస్తున్నామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. వేసవి కాలం కావడంతో రక్తనిధి కేంద్రాల్లో నిల్వలు తక్కువగా ఉన్నట్లు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు తెలియజేశారని పేర్కొన్నారు. ఈ మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల సేవా పథకం, రాష్ట్ర ప్రాణదాత పురస్కార్ అవార్డు గ్రహీత కొమ్మోజు గణేష్ సహకారంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, యువతీ యువకులు పాల్గొని ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు లోహితాష్, రాజబాబు, జయలక్ష్మి, సుర్యారావు, గౌరీశంకర్‌లను 82973 74754, 6303499360, 8332964373, 9441334001లో సంప్రదించాలని కోరారు.

పకడ్బందీగా పేదలకు భూ పంపిణీ

- 1,671 మందికి 2,565.81 ఎకరాలు
- త్వరలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేత
- అర్హులు ఉంటే రెండో విడతలో అవకాశం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్



విశాఖ నుంచి జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, పాడేరు: జిల్లాలోని నిరుపేదలకు భూముల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుజేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. విశాఖలోని ప్రభుత్వ పేదల భూముల పంపిణీకి సంబంధించి ప్రజాప్రతినిధులు,అధికారులతో అసైన్‌మెంట్ కమిటీ సమావేశాన్ని జూమ్ విధానంలో మంగళవారం విశాఖలోని అతిథి గృహం నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1,671 మంది పేదలకు 2,565.81ఎకరాలు త్వరలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో గుర్తించిన అసైన్‌మెంట్ భూములు, అర్హులైన పేదల వివరాలను జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ అరకులోయ నియోజకవర్గం పరిధిలో 550మంది లబ్ధిదారులకు 777.45 ఎకరాలు, పాడేరు పరిధిలో 561మందికి 499.53 ఎకరాలు, రంపచోడవరం పరిధిలో 560 మందికి 1288.83ఎకరాల భూములను పంపిణీ చేసేందుకు ఆమోదించామన్నారు. త్వరలోనే సీఎం చేతులమీదుగా పంపిణీ చేస్తామన్నారు. అసైన్‌మెంట్ భూముల పంపిణీకి ప్రజాప్రతినిధులు ఆమోదం తెలిపారు.

పాడేరు, అరకులోయ, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులాపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ అర్హులైన పేదలు మరింత మంది ఉన్నారన్నారు. వారికి కూడా అసైన్డ్‌భూములు పంపిణీ చేయాలని మంత్రిని కోరారు. వీరిలో అర్హులను గుర్తించి రెండవ విడత జాబితాలో చేర్చాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సమావేశానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్సీలు, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు అభిషేక్, సూరజ్ గనోరే, సబ్‌కలెక్టర్ శుభం బన్సల్ హాజరయ్యారు.

క్లుప్తంగా

ఘాట్ రోడ్డులో లారీ బోల్తా


ఘాట్‌లో బోల్తాపడిన లారీ

మారేడుమిల్లి : మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో మంగళవారం ఓ లోడు లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాల య్యాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన లారీ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నుంచి ఛత్తీస్‌గఢ్‌కు మొక్కల లోడుతో వెళ్తుండగా పాములేరు గ్రామం దాటిన తరువాత ఘాట్‌లోని వాలీసుగ్రీవ్ మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. లారీలో క్లీనర్, డ్రైవర్ ఉన్నారు. వారికి స్వల్ప గాయాలయ్యాయి. లారీ రోడ్డుపైనే అనుకుని బోల్తా పడడంతో పెను ప్రమాదం తప్పింది. ఇరువైపులా రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలగలేదు.

71 మందికి ఇంటర్వ్యూలు

కొయ్యూరు: ప్రధాని ఉపాధి కల్పన యోజన పథకానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న 71 మందికి మంగళవారం ఎంపీడీవో లాలం సీతయ్య, ఏపీఎం శ్రీనివాస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు.మండలానికి 25 యూనిట్లు మంజూరయ్యాయి.35 శాతం సబ్సిడీ ఉంటుంది. అయితే వచ్చిన వారికి బ్యాంకర్ల నుంచి అనుమతి తీసుకురావాలని వారు సూచించారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు దీనిని ఏర్పాటు చేస్తున్నారని ఎంపీడీవో తెలిపారు.

20న పాడేరులో మెగా జాబ్ మేళా

పాడేరు రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, సీ డాప్ సంయుక్తంగా పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి. ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో అపోలో ఫార్మసి, నవత రోడ్‌ట్రాన్స్‌పోర్ట్, డెక్కన్ కెమికల్స్, పేటీఎం, కేర్ ఫర్ యు, అరబిందో, వైఎస్‌కే ఇన్ఫోటెక్, కాజెంట్ ఈ–సర్వీసెస్ తదితర 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగి ఇంటర్, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, ఆపై చదువులు పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ. 20వేల వరకు జీతం ఇస్తారని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ గిరిజన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 6304634447 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

వరుణాస్త్ర.. మేడ్ ఇన్ వైజాగ్

- నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీలో నిర్మాణం
- ఇటీవల ఈ టార్పెడో ప్రయోగం విజయవంతం
- యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, యుద్ధ విమానాల నుంచి ప్రయోగించేలా రూపకల్పన
- 50 కి.మీ దూరంలోని టార్గెట్‌ను మట్టుపెట్టగల సామర్థ్యం


వరుణాస్త్ర



సాక్షి, విశాఖపట్నం: భారత నౌకాదళానికి అత్యంత శక్తివంతమైన వరుణాస్త్రను అందించిన ఘనతను విశాఖ సొంతం చేసుకుంది. ఇండియన్ నేవీ యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ సామర్థ్యాలను మెరుగుపరచడానికి వరుణాస్త్ర టార్పెడోను భారత రక్షణ పరిశోధన సంస్థ(డీఆర్‌డీవో), భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సహకారంతో ఎన్‌ఎస్‌టీఎల్ తయారు చేసింది. మూడేళ్ల కిందటే ఈ హెవీ వెయిట్ టార్పెడో (వరుణాస్త్ర) నిర్మాణాన్ని పూర్తి చేసిన ఎన్‌ఎస్‌టీఎల్.. 2020 నవంబర్‌లో భారత నౌకాదళానికి అప్పగించింది. ఇప్పటికే యుద్ధ నౌక, యుద్ధ విమానం నుంచి విజయవంతంగా వరుణాస్త్ర ప్రయోగాన్ని నిర్వహించిన భారత నౌకాదళం తాజాగా సబ్‌మెరైన్ నుంచి ప్రయోగించి విజయవంతంగా 40 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాన్ని ఛేదించింది.

వరుణాస్త్ర.. గొప్ప వరం

ఎన్‌ఏడీ జంక్షన్ సమీపంలోని ఎన్‌ఎస్‌టీఎల్‌లో వరుణాస్త్ర తయారైంది. అనేక ట్రయల్స్ తర్వాత వరుణాస్త్ర హెవీ వెయిట్ టార్పెడో.. అన్ని యుద్ధనౌకలు, జలాంతర్గాముల నుంచి ప్రయోగించేలా రూపుదిద్దుకుంది. ఈ వరుణాస్త్ర సామర్థ్య లక్షణాలను అంచనా వేసేందుకు డీఆర్‌డీవో ఆధ్వర్యంలో 130 సాంకేతిక ట్రయల్స్, యూజర్ ట్రయల్స్ నిర్వహించారు. వరుణాస్త్ర హెవీ వెయిట్ టార్పెడో యాంటీ సబ్‌మెరైన్, యాంటీ షిప్ ఆపరేషన్లలో విద్యుత్‌తో నడిచేలా రూపొందించారు. ఇది గరిష్ఠంగా సాగర గర్భంలో 600 మీటర్ల లోతులో గంటకు 70 కిలోమీటర్ల వేగంతో.. 50 కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణించగలదు. అత్యంత అధునాతన ఆయుధమైన వరుణాస్త్ర భారత్‌కు గొప్ప వరంగా మారింది.

టార్గెట్ మిస్ అవ్వదు

వరుణాస్త్ర సముద్ర గర్భంలో అర కిలోమీటర్ లోతులో ఉన్నప్పటికీ నావిగేషన్ సిస్టమ్‌కు సంకేతాలను అందించగలదు. నీటి అడుగున ఎలాంటి ప్రతికూల వాతావరణంలోనైనా శత్రుదేశాల జలాంతర్గాములను ట్రాక్ చేసి మట్టుపెట్టగలదు.

వరుణాస్త్ర విశేషాలివీ..

ఈ హెవీ వెయిట్ టార్పెడో వరుణాస్త్రను సముద్రంలో దాగి ఉన్న శత్రు దేశపు జలాంతర్గామిపై ప్రయోగించవచ్చు. 95 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారైంది. ప్రపంచంలో జీపీఎస్ ఆధారంగా దూసుకుపోయే ఏకైక టార్పెడోగా వారుణాస్త్ర వినుతి కెక్కింది. దీని విశిష్టతల్ని ఓసారి పరిశీలిస్తే..

వరుణాస్త్ర బరువు	1500 కిలోలు
పొడవు	7 నుంచి 8 మీటర్లు
వ్యాసం	533 మిల్లీ మీటర్లు
వార్‌హెడ్ బరువు	250 కిలోలు
ఆపరేషన్ పరిధి	50 కి.మీ
ఎంత లోతులోని సబ్‌మెరైన్‌ని ధ్వంసం చేయగలదు	600 మీటర్లు
నీటిలో ఎంత వేగంతో దూసుకెళ్తుంది	గంటకు 70 కిలో మీటర్లు

వరుణాస్త్రలో ఉన్న వార్‌హెడ్ పేలిపోయే అవకాశాలు చాలా తక్కువ. దీన్ని ఆపరేట్ చేయడం, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడం చాలా సులభంతో పాటు సురక్షితం . అతి తక్కువ ఖర్చుతో తయారు చేసిన ఈ హెవీవెయిట్ టార్పెడో నేవీ యుద్ధ కార్యాచరణ అవసరాలను తీర్చగలదు. స్వదేశీ పరిజ్ఞానంతోనూ హెవీ వెయిట్ టార్పెడోలు తయారు చేయగల సత్తా భారత్ సాధించిందన్న సంకేతాలను వరుణాస్త్ర ద్వారా ప్రపంచ దేశాలకు చాటి చెప్పారు.


ఎన్‌ఎస్‌టీఎల్

గిరిజనులతో కలెక్టర్ మమేకం

కిల్లంకోట పంచాయతీలో పర్యటన


సుబ్బులు గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

జి.మాడుగుల: మండలంలోని మారుమూల కిల్లంకోట పంచాయతీలో పలు గ్రామాల్లో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యటించారు. సుబ్బులు గ్రామంలోని గిరిజన ప్రజలతో ఆయన మమేకమయ్యారు. ప్రభుత్వ పథకాల అమలుతీరు, వైఎస్సార్ బీమా, తాగునీరు, రోడ్లు తదితర వివరాలను తెలుసుకున్నారు. సెల్ టవర్ ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను వారి మాటల్లోనే తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుబ్బులు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మొబైల్ టవర్‌ను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని ఆయన వివరించారు. అనంతరం కోడిమామిడి గెడ్డపై వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖరరావు, తహసీల్దార్ అప్పలరాజు, ఐకేపీ ఏపీఎం సుందరమ్మ, సర్పంచ్‌లు మాలన్న, చెల్లమ్మ, ఎంపీటీసీ అప్పలరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచండి

- పాడేరు గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు
- మండలంలో సుడిగాలి పర్యటన


జి.మాడుగులలో జీవీకే కిట్లు సరఫరా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పాడేరు డీడీ కొండలరావు


నిట్టమామిడిలో జగనన్న విద్యా కానుక కిట్లు పొందిన విద్యార్థులతో డీడీ కొండలరావు

జి.మాడుగుల: విద్యార్థినుల హాజరుశాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని పాడేరు గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు ఆదేశించారు. మంగళవారం ఆయన పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. దీనిలో భాగంగా బంధవీధి బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థినుల హాజరును ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ పూర్తిస్థాయిలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.గన్నేరుపుట్టు పాఠశాలలో చేపట్టి నాడు–నేడు పథకం పనులను పరిశీలించారు. నిట్టమామిడిలో పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతో జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేయించారు. వెన్నెల పాఠశాలలో నాడు–నేడులో నిర్మిస్తున్న భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భవనం పూర్తియ్యేంత వరకు స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పాఠశాల తరగతులను నిర్వహించాలని ఉపాధ్యాయుడికి సూచించారు. గాంధీగనరంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలలో జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను ఆయన తనిఖీ చేశారు. బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థినులు పూర్తిస్థాయిలో పాఠశాలలకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. లేదంటే శాఖాపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. జీఎం కొత్తూరు బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. ఇక్కడికి సమీపంలోని మరో బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థుల హాజరును పరిశీలించి, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో తిరుపాల్, ఎంఈవో కృష్ణమూర్తి, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు 30 చివరి తేదీ

ఎంవీపీకాలనీ (విశాఖ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) 2023 జూలై ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానించింది. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు కల్పించనున్నారు. కోర్సుల్లో ప్రవేశాలకు జూన్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

అడ్డతీగల : అడ్డతీగల మండలం బొంగరాలపాడుకి చెందిన నర్సి అప్పన్న(50) అనే వ్యక్తి పిడుగుపాటుకి గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం సాయంత్రం పొలంలో పని ఉందని అప్పన్న ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. అతను రాత్రంతా ఇంటికి రాకపోయేసరికి మంగళవారం ఉదయాన్నే అతని ఆచూకీ కోసం వెతుక్కుంటూ పొలంలోనికి వెళ్లి చూడగా అప్పన్న విగతజీవుడుగా పడి ఉన్నాడు. పొలం పనులు చేసుకుంటుండగా వర్షం రావడంతో చెట్టు కిందికి వెళ్లగా పిడుగుపాటుకు గురై మృతి చెందినట్టు భావిస్తున్నారు. దీంతో కుటుంబ సభ్యులు భోరున విలపించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అడ్డతీగల ఎస్‌ఐ అప్పలరాజు ఆధ్వర్యంలో సంఘటన స్థలంలో అప్పన్న మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం అడ్డతీగల సీహెచ్‌సీకి తరలించారు.


బొంగరాలపాడులో పిడుగుపాటుకు గురై మరణించిన నర్సి అప్పన్న

తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలు

రాజవొమ్మంగి : జడ్డంగి–చెరకుంపాలెం మధ్య మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అమీనాబాద్‌కాలనీకి చెందిన తండ్రి, కుమారుడు తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాలివి. మేలేటి సీతారాంబాబు (44), దుర్గాప్రసాద్ (24) ఏలేశ్వరం నుంచి మోటారు బైక్‌పై స్వగ్రామం వస్తున్నారు. ఇంతలో జడ్డంగి నుంచి చెరకుంపాలెం వైపు వెళుతున్న ట్రాక్టర్ మోటారు బైక్‌ను ఢీ కొట్టడంతో మోటారు సైకిల్‌పై వెళుతున్న తండ్రి కొడుకులకు తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలిసిన సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు సంఘటన స్థలానికి వెళ్లి, స్థానికుల సహాయంతో క్షతగాత్రులను ఆటోలో జడ్డంగి పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందజేసి కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన తండ్రి మోలేటి సీతారాంబాబు, కొడుకు దుర్గాప్రసాద్

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిక


సత్తిరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: మండలంలోని మర్రివాడకు చెందిన అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఆత్మ) మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు సత్తిరెడ్డి, ఆయన సతీమణి మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి వీరికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

టైలర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- టైలర్ల కార్పొరేషన్ చైర్మన్ సుబాన్‌బీ


బాపనమ్మ అమ్మవారిని దర్శించుకుని వస్తున్న చైర్‌పర్సన్ సుబాన్‌బీ

రంపచోడవరం: రాష్ట్రంలో దర్జీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర టైలర్ల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుబాన్‌బీ తెలిపారు. సీతపల్లి బాపనమ్మ అమ్మవారిని మంగళవారం ఆమె దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టైలర్లకు రూ.10వేల చొప్పున అందజేసి ఆదుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దక్కుతుందన్నారు. వెనుకబడిన వర్గానికి చెందిన తనకు చైర్‌పర్సన్ పదవి ఇవ్వడం గొప్పవిషయమన్నారు. టైలరింగ్ షాపులకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టైలర్ల యూనియన్ నాయకుడు గంగుల త్రిమూర్తులు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

హుకుంపేట: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత పొందవచ్చని జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం తెలిపారు. మండలంలోని అండిభ పంచాయతీ అడపరాయి, బంగారుబుడి,భీమవరం పంచాయతీ రామచంద్రపురం,రంగశీల పంచాయతీ ఇరుకువలస గ్రామాలను ఆయన మంగళవారం సందర్శించారు. దేవాలయాల నిర్మాణాలు చేపట్టేందుకు స్థల పరిశీలన చేశారు.ఆలయాల నిర్మాణానికి దేవదాయశాఖ మంజూరు చేసిన రూ.10 లక్షల చెక్కును దేవదాయ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షేక్ సైదు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల కమిటీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ భక్తి మార్గంలో నడవాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు కొర్ర మొద్దు,గెమ్మెలి అప్పారావు, చంటి, వెంకట్, ఈశ్వరరావు పాల్గొన్నారు.


దేవాలయాల నిర్మాణానికి చెక్కును అందజేస్తున్న జెడ్పీటీసీ మత్స్యలింగం

నాబార్డు-రాంకీ ఫౌండేషన్ పథకాల పరిశీలన


కొయ్యూరు: నాబార్డు–రాంకీ ఫౌండేషన్ మాతోట ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలను నాబార్డు జనరల్ మేనేజర్ ఎంకె.డే, హైదరాబాద్ మేనేజర్ హరిప్రీత్ సింగ్‌లు మంగళవారం పరిశీలించారు. ఎం .మాకవరంలో ఏర్పాటు చేసిన విస్తరాకుల కుట్టు కేంద్రాన్ని, రైతులకు ఇచ్చిన ట్రాక్టర్‌ను,ట్యాంకర్‌ను వరిశీలించారు.నడింపాలెం,కాకరపాడు,చింతలపూడి,నడింపాలెం గ్రామాలు సందర్శించారు.అక్కడ గ్రామస్తులతో సమావేశమయ్యారు.రాంకీ ఫౌండేషన్‌తో పాటు నాబార్డు ద్వారా అందుతున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాంకీ సీఎస్ఆర్ హెడ్ ఎం.వి.రామిరెడ్డి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్,సిబ్బంది హరికృష్ణ, శ్రీను, సత్తిబాబు,రామారావు పాల్గొన్నారు


విస్తరాకుల తయారీని పరిశీలిస్తున్న అధికారులు

తక్కువ పెట్టుబడితో చిరుధాన్యాల సాగు

కొయ్యూరు: తక్కువ పెట్టుబడితో చిరుధాన్యాలను సాగు చేసి, తద్వారా బలమైన ఆహారం పొందవచ్చని బీసీటీ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వానా ప్రసాదరావు అన్నారు. కొమ్మిక పంచాయతీ తుమ్మలబందలో రైతులకు చిరుధాన్యాల సాగుపై మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. తక్కువ నీటితో వీటిని సాగుచేయవచ్చని చెప్పారు. సస్యరక్షణపై శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ అవగాహన కల్పించారు. గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా ఇంద్రావతి రకం చోడి విత్తనాలను , ఏబీబీ–04 రకం గంటి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా విమర్శలు సరికాదు


మాట్లాడుతున్న డాక్టర్ వెంకటలక్ష్మి

జి.మాడుగుల: రాష్ట్రంలో సీఎం వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పారదర్శకంగా సంక్షేమపాలన అందిస్తుంటే బీజేపీ నాయకులు విమర్శలు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక విలేకర్లతో మంగళవారం ఆమె మాట్లాడారు. విభజన చట్టంలో ఉన్న హామీలను నెరవేర్చలేని బీజేపీ నాయకులు ఆంధ్రప్రదేశ్‌లో పాలన గురించి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల విశాఖపట్నంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. ఎంతోమంది ప్రాణత్యాగంతో సాధించిన స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న విషయం నిజం కాదా అని ఆమె ప్రశ్నించారు. విభజన చట్టంలో హామీలను ఇప్పటి వరకు ఎందుకు నెరవేర్చలేదని, ప్రత్యేక హోదా, విశాఖలో రైల్వే జోన్ ఏమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.మత్స్యకొండంనాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మస్టర్లలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

ఉపాధి ఏపీడీ భాగ్యారావు

రాజవొమ్మంగి: ఉపాధి పనుల మస్టర్లలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని అడ్డతీగల క్లస్టర్ ఏపీడీ కె. భాగ్యారావు హెచ్చరించారు. స్థానిక ఉపాధిహామీ పథకం కార్యాలయం వద్ద ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశమయ్యారు. ప్రతి వేతనదారుడికీ రోజుకు రూ.272 చొప్పున వేతనం గిట్టుబాటు అయ్యేలా కొలతలు ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏపీడీ సూచించారు. లక్ష్యం మేరకు వేతనదారులు పనులకు వచ్చేలా చూడాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి పనుల్లో టెక్నికల్ లోపాలు జరుగుతున్నట్టు కలెక్టర్ గుర్తించారని చెప్పారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధి పనులను పరిశీలిస్తున్నామని చెప్పారు. లోపాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జేఈ ఎస్.వి.వి.ఎస్. శ్రీనివాస్, స్థానిక ఏపీవో వందే సురేష్‌కుమార్ పాల్గొన్నారు.


ఉపాధి ఫీల్డ్ సిబ్బందితో సమావేశమైన ఏపీడీ భాగ్యారావు

కొనసాగుతున్న ఓరియంటేషన్ తరగతులు

మురళీనగర్(విశాఖ): పాలిసెట్ కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో నిర్వహిస్తున్న ఓరియంటేషన్ తరగతులు మంగళవారం కొనసాగాయి. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లో స్థానిక ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ తరగతులకు రెండో రోజు 80 మంది విద్యార్థులు హాజరయ్యారు. సిస్టమ్ అడ్మిన్ సిహెచ్.జయప్రకాష్‌రెడ్డి విద్యార్థులకు వెబ్ ఆప్షన్లపై అవగాహన కల్పించారు. పాలిటెక్నిక్ కోర్సుల వివరాలు వాటి ప్రాధాన్యతను వివరించారు.